సాక్షి నల్లగొండ

శుక్రవారం । 17 । జనవరి । 2025



ఒప్పందాలు రద్దు చేసుకోవాలి

అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం డిమాండ్ చేశారు. - 8లో



ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

బైక్‌లు చోరీ చేస్తున్న నిందితుడితో పాటు అతడి నుంచి బైక్‌లు విక్రయించిన మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



సాగర్‌లో కైట్ ఫ్లైయర్స్

అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన సాగర్‌ను గురువారం పలు దేశాలకు చెందిన కైట్ ఫ్లైయర్స్ సందర్శించారు. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి కళాశాలలు పునఃప్రారంభం

నల్లగొండ: జూనియర్ కళాశాలలు శుక్రవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు ఇంటర్‌బోర్డు సంక్రాంతి సెలవులు ప్రకటించింది. సెలవులు ముగియడంతో నేటినుంచి విద్యార్థులు కళాశాల బాట పట్టనున్నారు. అదే విధంగా పాఠశాలలకు శుక్రవారంతో సంక్రాంతి సెలవులు ముగియనున్నాయి. 18 నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి.

వైద్యులు సమయపాలన పాటించాలి

కొండమల్లేపల్లి: వైద్యులు సమయపాలన పాటిస్తూ ఆస్పత్రికి వచ్చే వారికి సకాలంలో సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం దేవరకొండ డివిజన్ పరిధిలోని 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యాధికారి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తప్పనిసరిగా ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఇండికేటర్, ఎంసీహెచ్, ఆర్‌ఐ, ఎన్టీపీ, ఎన్‌సీడీ, సీడీఆర్‌లపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో దేవరకొండ ఉప వైద్యాధికారి కేశ రవి, కృష్ణకుమారి, అరుంధతి, పద్మజ, కొండమల్లేపల్లి మెడికల్ ఆఫీసర్ ఉషారాణి పాల్గొన్నారు.

సీఎంఆర్ ఇవ్వకుంటే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నల్లగొండ: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను సకాలంలో ఇవ్వని మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని, వారి మిల్లులను బ్లాక్ లిస్టులో పెడతామని జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం నల్లగొండలోని తన చాంబర్‌లో రైస్ మిల్లర్లతో 2024–25 వానాకాలం, యాసంగి సీఎంఆర్‌పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగి సీఎంఆర్‌ను ఈనెల 25 లోగా నూటికి నూరు శాతం అప్పగించాలన్నారు. మిల్లర్లకు యాసంగిలో 3,26,099 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చామని, మిల్లర్లు 2,21,747 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2,01,892 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, మిల్లర్లు పాల్గొన్నారు.

పెద్దగట్టు ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

చివ్వెంల : సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని శ్రీలింగమంతుల స్వామి(పెద్దగట్టు) ఆలయ కమిటీ గురువారం ప్రమాణస్వీకారం చేసింది. ఆలయ కమిటీ చైర్మన్, సూర్యాపేట పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది పోలేబోయిన నర్సయ్య, డైరెక్టర్లు పోలేబోయిన నరేష్ పిళ్లే, కుర్ర సైదులు, వీరబోయిన సైదులు, మెంతబోయిన లింగస్వామి, మెంతబోయిన చిన్న మల్లయ్య, సిరపంగి సైదమ్మ చేత దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కృష్ణవేణి, ఈఓ కుశలయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిని జాతరకు ఆహ్వానిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొప్పుల వేణారెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, ఎలిమినేటి అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

• తిరుగు పయనం







సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లిన జనం హైదరాబాద్‌కు తిరుగు పయనం కావడంతో గురువారం కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు, నల్లగొండ బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న జనం, కిక్కిరిసి బస్సెక్కుతున్న ప్రయాణికులు

తొలిరోజు 136 గ్రామాలు

రైతు భరోసా అమలుకు భూ సర్వే ప్రారంభం

- క్షేత్రస్థాయిలో భూములను పరిశీలిస్తున్న అధికారులు
- సాగుకు యోగ్యంకాని, యోగ్యమైన వాటి వివరాలు సేకరణ
- రేషన్‌కార్డు అర్జీదారుల ఇళ్ల పరిశీలన కూడా..

నల్లగొండ: రైతు భరోసా పథకం అమలుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఈ నెల 26న లాంఛనంగా ప్రారంభించనున్న రైతు భరోసాకు సంబంధించి క్షేత్ర స్థాయిలో భూముల పరిశీలన కోసం గురువారం భూ సర్వే ప్రారంభించింది. తొలి రోజు 40 బృందాలుగా ఏర్పడిన వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది 136 గ్రామాల్లో సర్వే నిర్వహించారు. సాగుకు యోగ్యంకాని, యోగ్యమైన భూముల వివరాలు సేకరించారు. ఈ సర్వేను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చిట్యాల మండలంలో, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ నల్లగొండ మండలం అన్నెపర్తిలో పరిశీలించారు. దీంట్లో భాగంగా యంత్రాంగం రేషన్ కార్డుల పంపిణీ కోసం దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తోంది.

140 బృందాల ఆధ్వర్యంలో సర్వే

అర్హులైన రైతులకు రైతు భరోసా అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అర్హులను తేల్చేందుకు క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని సర్వే నంబర్ల ఆధారంగా సాగుకు యోగ్యమైన, యోగ్యంకాని భూముల పరిశీలనకు సర్వే చేపట్టింది. ఇందుకు మొత్తం 140 బృందాలను నియమించారు. ఈ బృందాలు జిల్లాలోని 844 గ్రామ పంచాయతీల్లో నాలుగు రోజుల పాటు సర్వే చేయనున్నాయి. అయితే ఒక్కో బృందంలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐ, ఏఈఓ లేదా ఏఈలు పాల్గొంటున్నారు. వీరంతా గ్రామాల వారీగా సర్వే నంబర్ల ఆధారంగా భూములను పరిశీలిస్తున్నారు. వ్యవసాయానికి యోగ్యమైన భూమా కాదా అని చూస్తున్నారు. వ్యవసాయానికి యోగ్యమైన భూమి అయి ఉండి వ్యవసాయం చేయకపోయినా కూడా దాన్ని ఆమోదిస్తున్నారు. వ్యవసాయానికి యోగ్యంగా లేని గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, రోడ్లు, ఇంటి నిర్మాణం కూడా ఉన్న వాటిని గుర్తించి మాన్యువల్‌గా రికార్డు చేస్తున్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు : కలెక్టర్



చిట్యాల: వెలిమినేడులో భూముల రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చిట్యాల: వ్యవసాయ భూముల క్షేత్ర స్థాయి పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా చేపట్టి అర్హులైన రైతులకు రైతు భరోసా అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులను ఆదేశించారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో గురువారం చేపట్టిన భూసర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలు లేకుండా లబ్ధిదారుల జాబితా రూపొందించాలన్నారు. తర్వాత చిట్యాలలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. ఇదే సమయంలో కార్యాలయానికి వచ్చిన పలువురితో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఏఓ శ్రవణ్‌కుమార్, తహసీల్దార్ కృష్ణనాయక్, ఎంపీడీఓ జయలక్ష్మి, ఏఓ గిరిబాబు పాల్గొన్నారు.

20 శాతం గ్రామాల్లో రేషన్‌కార్డుల పరిశీలన పూర్తి

జిల్లాలో మొత్తం 27,523 మంది రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. కులగణన జాబితా ఆధారంగా ప్రభుత్వం వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించాలని ఆదేశించింది. దీంతో జిల్లా అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి దరఖాస్తుదారుల వారీగా పరిశీలన చేశారు. మొదటి రోజు దాదాపు 20 శాతం వరకు రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్లు డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా జిల్లా వ్యాప్తంగా మరో మూడు రోజుల పాటు భూ సర్వే, రేషన్‌కార్డు దరఖాస్తుదారుల ఇళ్ల పరిశీలన కొనసాగనుంది.

99 మంది పంచాయతీ కార్యదర్శుల

సర్వీస్ బ్రేక్!

కలెక్టర్ ఇలా త్రిపాఠి సంచలన నిర్ణయం

- అనుమతి లేకుండా నెలల తరబడి విధులకు హాజరుకాని కార్యదర్శులు
- విధుల్లో చేరేందుకు కలెక్టర్ అనుమతి, వివిధ ప్రాంతాల్లో పోస్టింగ్
- సర్వీస్ బ్రేక్‌తో రెగ్యులరైజేషన్, ఇంక్రిమెంట్లలో నష్టపోనున్న కార్యదర్శులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి అనుమతి లేకుండా నెలల తరబడి విధులకు గైర్హాజరు కావడంతో వారి సర్వీస్‌ను బ్రేక్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు.. వారిని తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు అనుమతి ఇచ్చి వివిధ ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో పనిచేసే 99 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు నెలల నుంచి 11 నెలల పాటు (ఒక్కొక్కరు ఒక్కో రకంగా) విధులకు గైర్హాజరు అయ్యారు. గత నెలలో వారంతా విధుల్లో చేరేందుకు కలెక్టర్‌ను సంప్రదించగా ఇప్పుడు నిర్ణయం తీసుకున్నారు.

అనుమతి లేకుండా గైర్హాజరు

గ్రామాల్లో ఇప్పటికే సర్పంచులు లేరు. కార్యదర్శులు కూడా లేకపోతే గ్రామ పాలన పూర్తిగా ఆగిపోయే పరిస్థితి నెలకొంది. గ్రూపు–1 గ్రూపు–2 పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు చాలా మంది పంచాయతీ కార్యదర్శులు విధులకు కొన్ని నెలలుగా గైర్హాజరయ్యారు. వాస్తవానికి వారు ముందస్తుగా ఉన్నాధికారుల అనుమతి తీసుకొని, సెలవు పెట్టాలి. కానీ, వారు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా.. సెలవు పెడుతున్నట్లు ఒక పేపరుపై రాసి కార్యాలయంలో ఇచ్చి వెళ్లిపోయారు. ప్రస్తుతం వారంతా విధుల్లో చేరేందుకు వచ్చారు. అయితే ఆ 99 మంది కార్యదర్శుల గైర్హాజరు కాలానికి సంబంధించిన సర్వీస్‌ను బ్రేక్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి నిర్ణయం తీసుకున్నారు. వారంతా విధుల్లో చేరేందుకు ఉత్తర్వులు ఇస్తూ వారికి పాత స్థానాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారు. సర్వీస్ బ్రేక్ చేయడంతో గైర్హాజరైన కాలానికి సంబంధించి సర్వీస్ అంతా కోల్పోవాల్సి వస్తుంది. బ్రేక్ కాలాన్ని సర్వీస్ బుక్‌లో రాయడం వల్ల భవిష్యత్‌లో సర్వీస్ రెగ్యులరేజేషన్, ఇంక్రిమెంట్లు, పెన్షన్ల తదితర వాటిల్లో వారికి నష్టం జరిగే అవకాశం ఉంది.

వరుసగా సిబ్బందిపై కఠిన చర్యలు

విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం గుర్రంపోడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయగా.. డాక్టర్‌తో పాటు ఏ ఒక్కరూ విధుల్లో లేరు. మూకుమ్మడిగా గైర్హాజరు కావడంతో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఆరుగురు సిబ్బందిని విధుల నుంచి తొలగించడంతోపాటు ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న మరుసటి రోజే జిల్లాలో 99 మంది పంచాయతీ కార్యదర్శుల సర్వీసును బ్రేక్ చేస్తూ మరో నిర్ణయం తీసుకున్నారు. రెండు రోజుల్లోనే కలెక్టర్ తీసుకున్న నిర్ణయాలు సంచలనంగా మారాయి.

చిట్యాల వాసులకు ట్రాఫిక్ కష్టాలు



చిట్యాలలో హైవే రోడ్డును దాటేందుకు ఎదురుచూస్తున్న ద్విచక్ర వాహనదారులు

చిట్యాల: సంక్రాంతి పండుగ నేపథ్యంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలతో చిట్యాల పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నార్త్ చిట్యాల నుంచి సౌత్ చిట్యాల వైపు వెళ్లాలంటే తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న జంక్షన్ వద్ద హైవే రోడ్డు దాటాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు వాహనాలు అతివేగంగా వెళుతుండడంతో ఈ జంక్షన్‌లో రోడ్డు దాటాలంటే పది నుంచి పదిహేను నిమిషాల వరకు ఆగాల్సి వస్తోంది. అంతేకాకుండా హైవేపై పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న జంక్షన్ సమీపంలో నార్త్ చిట్యాల నుంచి సౌత్ చిట్యాలకు ద్విచక్ర వాహనారులు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారిని పోలీసులు మూసివేశారు. దీంతో బస్‌స్టేషన్ సమీపంలో రాంగ్ రూట్‌లో ద్విచక్ర వాహనారులు వెళ్లాల్సి వస్తోంది. కాగా ఆదివారం వరకు హైవేపై ట్రాఫిక్ ఉండనుండడంతో ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఎస్పీ కార్యాలయానికి నలుగురు ఉద్యోగుల అటాచ్

నల్లగొండ: ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన నలుగురు ఉద్యోగులను గురువారం ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇప్పటికే ఇంటెలిజెన్స్ ఎస్పీ కవితను అవినీతికి పాల్పడిందన్న ఆరోపణలపై డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే ఇదే శాఖకు చెందిన రాజు, కొండల్ అనే ఇద్దరు ఉద్యోగులను కూడా ఎస్పీ కార్యాలయానికి సరెండర్ చేశారు. కాగా ఇదే విభాగంలో పనిచేసే హెడ్‌కానిస్టేబుల్ సైదయ్య, కానిస్టేబుల్ వసీం, డ్రైవర్ హుస్సేన్, రైటర్ ఖదీర్‌ను తాజాగా ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షలకు 650 మంది

నల్లగొండ: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టైలరింగ్ హయ్యర్ పరీక్షలు గురువారం నల్లగొండలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు జరిగాయని డీఈఓ భిక్షపతి తెలిపారు. రెండు సెషన్లలో కలిపి మొత్తం 877 మందికి గాను 650 మంది పరీక్షలు రాశారని, 227 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

భక్తులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

- చెర్వుగట్టు ఆలయ బ్రహ్మోత్సవాలపై అధికారుల సమీక్షలో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు

నార్కట్‌పల్లి: చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతి జడలరామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఫిబ్రవరి 2 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న చెర్వుగట్టు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలపై ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి గురువారం ఆమె నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతి జడలరామలింగేశ్వర స్వామి దేవాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చాంబర్‌లో జిల్లా అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలన్నారు. ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో భక్తుల కోసం బారికేడ్లతో క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ పూర్తి భద్రత కల్పించాలని, ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ రూం ద్వారా ఎప్పటికప్పుడు రద్దీని పర్యవేక్షించాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, అంతర్గత రోడ్లు, ప్రధాన రోడ్లకు మరమ్మతులు ఉంటే తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. భక్తులకు తాగునీటి ఇక్కట్లు లేకుండా అవసరమైతే ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైతే 33 కేవీ జనరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అత్యవసర వైద్యసేవలకు గాను ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసి నార్కట్‌పల్లి, అక్కెనపల్లి పీహెచ్‌సీ సిబ్బందిని విధుల్లో నియమించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో మద్యం విక్రయాలను నియంత్రించాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవాలను సక్రమంగా నిర్వహించేందుకు రెవెన్యూ అదనపు కలెక్టర్‌ను పర్యవేక్షణ అధికారిగా, నల్గొండ ఆర్‌డీఓను ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా తనవంతు సహకారం అందిస్తానన్నారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యేంత వరకు ఇక్కడే ఉండి పర్యవేక్షిస్తానని పేర్కొన్నారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశానికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం వారు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించగా వేదపండితులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఎస్పీ జి.రమేష్, దేవాదాయ శాఖ కమిషనర్ కె.భాస్కర్, ఆలయ ఈఓ నవీన్, జిల్లాఅధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్, ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



'మిషన్ ఆర్‌ఆర్‌ఆర్' పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తదితరులు

- ప్రతి గ్రామంలో రోడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదాలను నివారణే లక్ష్యంగా మిషన్ ఆర్‌ఆర్‌ఆర్ (రోడ్ సేఫ్టీ, రూల్స్, రెస్పాన్స్‌బులిటీ) ప్రారంభించినట్లు జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ ఆధర్యంలో గురువారం నల్లగొండ పట్టణ పరిధిలోని చర్లపల్లిలో రోడ్డు ప్రమాదాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైవే వెంట ఉన్న గ్రామాల్లో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గడిచిన మూడేళ్లలో చర్లపల్లిలోనే 28 రోడ్డు ప్రమాదాలు జరగాయని, అందులో 12 మంది మృతి చెందారన్నారు. ఈ యేడాది యాక్సిడెంట్ ఫ్రీ జిల్లా చేయడమే మిషన్ ఆర్‌ఆర్‌ఆర్ లక్ష్యమన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రాష్ డ్రైవింగ్, ఓవర్ టేకింగ్, రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం వల్ల ప్రమాదాలు అధిగమించవచ్చన్నారు. యాక్సిడెంట్స్ వల్ల మృతిచెందిన కుటుంబాలు ఇంటి పెద్దదిక్కు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి స్పృహ కోల్పోయినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలో వైద్యులు గ్రామస్తులకు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కావాల్సిన సూచనలు చేస్తే పోలీస్ శాఖ తగు చర్యలు తీసుకుంటుందన్నారు. అందుకోసం ప్రతి గ్రామంలో విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాజాత బృందాలు ట్రాఫిక్ నిబంధనల గురించి చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా చర్లపల్లి విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీని నియమించారు. అనంతరం మిషన్ ఆర్‌ఆర్‌ఆర్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివ రామ్‌రెడ్డి, టూటౌన్ సీఐ రాఘవరావు, డీటీఆర్‌బీ ఇన్‌చార్జి, రిటైర్డ్ సీఐ అంజయ్య, ట్రాఫిక్ సీఐ రాజు, ఎస్‌ఐ సైదాబాబు, కౌన్సిలర్ రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండలం గుర్రతండాలో ఆదివారం రాత్రి భర్తను హత్య చేసిన ఇద్దరు భార్యలను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపారు. చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. గుర్రతండాకు చెందిన ధర్మావత్ సైదులు కొంతకాలంగా మద్యానికి బానిసై తన ఇద్దరు భార్యలు రమ్య, సుమలతతో పాటు కుటుంబ సభ్యులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని సీఐ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కూడా సైదులు మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యలను వేధించడంతో కోపోద్రిక్తులైన వారు రోకలిబండతో సైదులు తలపై మోది, గొంతు పిసికి హత్య చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. నిందితులను గురువారం తండాలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామగిరి(నల్లగొండ): కుటుంబ కలహాలతో పురుగు మందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. గురువారం నల్లగొండ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం రాములబండ గ్రామానికి చెందిన చంద్రకళ (35), ఆమె భర్త లింగరాజు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొన్నిరోజులుగా ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన చంద్రకళ సోమవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందింది. గురువారం మృతురాలి తల్లి శివరాత్రి సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సైదాబాబు కేసు నమోదు చేశారు. నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

దంపతులపై దాడి.. కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్: తమ వ్యవసాయ భూమి చుట్టూ కంచె వేస్తుండగా తమను అడ్డుకుని దాడికి పాల్పడిన వ్యక్తిపై మిర్యాలగూడ పట్టణానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ మన్నెం బుచ్చిరెడ్డి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం .. మన్నెం బుచ్చిరెడ్డికి అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి వెంట మిర్యాలగూడ పట్టణ పరిధిలో సర్వే నంబర్లు 627, 638లో ఎకరం 13 గుంటల వ్యవసాయ భూమి ఉంది. దాని చుట్టూ గురువారం బుచ్చిరెడ్డి, అతడి భార్య కవిత కంచె వేస్తుండగా మన్నెం సత్యనారాయణరెడ్డి అనే వ్యక్తి వచ్చి వారిని అడ్డుకుని దాడి చేశాడు. ఈ దాడిలో కవిత గాయపడింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు.

తొమ్మిది మందిపై హత్యాయత్నం కేసు

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలో ఈ నెల 12న జరిగిన దాడి కేసులో 9మందిపై పోలీసులు హత్యాహత్నం కేసు నమోదు చేశారు. పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన అంతటి నరేష్‌పై పాతకక్షల నేపథ్యంలో కత్తులు, రాడ్లతో దాడి చేసేందుకు హన్మవాడకు చెందిన 9మంది యువకులు యత్నించారు. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. 9మంది మంది హత్యాయత్నానికి పాల్పడినట్లు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి చౌటుప్పల్ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి పట్టణ పోలీసులు తెలిపారు.

హైవేలపై పకడ్బందీ భద్రత కల్పించాం

- రాచకొండ సీపీ సుధీర్ బాబు
- పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ పరిశీలన



పంతంగి టోల్‌ప్లాజా సిబ్బందితో మాట్లాడి వాహనాల రద్దీ గురించి తెలుసుకుంటున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, పోలీస్ అధికారులు

చౌటుప్పల్ రూరల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జాతీయ రహదారులపై ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పకడ్బందీ భద్రత కల్పించామని సీపీ సుధీర్ బాబు అన్నారు. గురువారం రాత్రి చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీని ఆయన పరిశీలించారు. హైదరాబాద్ వైపు వచ్చే వాహనాల కోసం ఎన్ని గేట్లు ఓపెన్ చేశారని టోల్‌ప్లాజా నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఫాస్టాగ్ స్కాన్ కాకపోతే వాహనాలను ఎలా పంపుతున్నారని ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఏటా పెరిగే వాహనాల రద్దీని ముందుగానే అంచనా వేసి ఈసారి హైవేలపై ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా రాచకొండ కమిషనరేట్ పరిధిలోనే 2వేల మంది పోలీసులతో విధులు నిర్వహించినట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్య రాకుండా ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి విజయవాడ, గుంటూరు వైపు వెళ్లే బస్సులను దారి మళ్లించామని తెలిపారు. బుధవారం సాయంత్రం నుంచి హైదరాబాద్ వైపు వాహనాల సంఖ్య పెరుగుతోందని అన్నారు. పండుగకు ముందే ప్రజలకు ట్రాఫిక్ సమస్యలపై, వాహనాలకు ఫాస్టాగ్ రీచార్జ్ చేసుకోవడంపై అవగాహన కల్పించామన్నారు. పోలీసు సిబ్బందికి ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. జాతీయ రహదారులపై విధులు నిర్వహించిన పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు. ఆయనతో పాటు చౌటుప్పల్ ఏసీపీ పి. మధుసూదన్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, సీఐ మన్మథకుమార్, విజయ్ మోహన్ తదితరులు ఉన్నారు.

సాఫీగా తిరుగు ప్రయాణం

చౌటుప్పల్ రూరల్, కేతేపల్లి: సంక్రాంతికి స్వగ్రామాలకు వెళ్లిన వారు పండుగ ముగియడంతో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్దకు గురువారం తెల్లవారుజాము నుంచే వాహనాలు ఎక్కువగా వస్తున్నా కూడా టోల్‌ప్లాజాలో వాహనాలు సాఫీగానే వెళ్తున్నాయి. టోల్‌ప్లాజాలో 16 గేట్లు ఉండగా.. హైదరాబాద్ వైపు 12 గేట్ల ద్వారా వాహనాలను పంపిస్తున్నారు. విజయవాడ నుంచి వస్తున్న వాహనాలకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడకుండా హైవే అథారిటీ అధికారులు గుర్తించిన 17 బ్లాక్ స్పాట్లతో పాటు ప్రతి గ్రామ స్టేజీ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రతి బ్లాక్ స్పాట్ వద్ద పోలీసులను ఏర్పాటు చేసి ట్రాఫిక్ జాం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద 12 టోల్ కౌంటర్లకు గాను ఏడు కౌంటర్లను హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు కేటాయించారు.



కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద రాత్రివేళ వాహనాల రద్దీ

అదానీతో ఒప్పందాలను రద్దు చేసుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



అంబుజా సిమెంట్ పరిశ్రమ ప్రతిపాదిత స్థలానికి ర్యాలీగా వెళ్తున్న తమ్మినేని, సీపీఎం నాయకులు

రామన్నపేట: స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి ఇచ్చిన వంద కోట్ల రూపాయల విరాళాన్ని తిరస్కరించినట్లే, రాష్ట్ర ప్రభుత్వం అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట శివారులో అదానీ సంస్థ అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన స్థలాన్ని గురువారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును ఒప్పుకోబోమని రైతులు ఖరాఖండిగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అదానీ సంస్థకు అవినీతి కొత్తేమీకాదని, అదానీ సంస్థ అమెరికా కంపెనీల్లో రూ.70వేల కోట్ల నిధులను సేకరించి సోలార్ ప్లాంట్లు స్థాపించి వాటిలో ఉత్పత్తయ్యే కరెంట్‌ను ప్రభుత్వాలకు మార్కెట్ ధర కంటే ఎక్కువకు అమ్మి లబ్ధిపొందే కుట్రకు పూనుకున్నాడని ఆరోపించారు. అదానీ అవినీతి కుంభకోణాలపై ప్రతిపక్ష నాయకుడు పార్లమెంటులో నిగ్గు తేల్చడంతో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరకాటలంలో పడి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి ఇచ్చిన వంద కోట్ల రూపాయల విరాళాన్ని తిరస్కరించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అదానీ సంస్థతో చేసుకున్న రూ.12,400 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలలోనే రామన్నపేటలో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించిన అంబుజా సిమెంట్ పరిశ్రమ కూడా ఉందని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల గోడును పట్టించుకుని అంబుజా సిమెంట్ పరిశ్రమ ఇక్కడ ఏర్పాటు చేయకుండా ఆపాలని కోరారు. త్వరలో సీఎంను కలిసి వినతిపత్రం సమర్పిస్తామని అప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే మిగిలిన రాజకీయ పక్షాలతో కలిసి ప్రజా ఉద్యమం నిర్మిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్, రాష్ట్రకమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంతల చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేక అశోక్‌రెడ్డి, మాటూరి బాలరాజు, పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య, పార్టీ మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం ఉన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు

- ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: ఈజీ మనీకి అలవాటు పడి బైక్‌లు చోరీ చేస్తున్న నిందుతుడితో పాటు అతడు బైక్‌లు విక్రయించిన మరో వ్యక్తిని మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖర రాజు విలేకరులకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాల్వాయి జంక్షన్ గ్రామానికి చెందిన శీలం నాగరాజు అలియాస్ నత్తోడు గురువారం నంబర్ ప్లేట్ లేని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై వస్తుండగా.. మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లైఓవర్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న టూటౌన్ పోలీసులు ఆపారు. బైక్ ఇంజన్ నంబర్, చాసిస్ నంబర్ పరిశీలించి గతంలో టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరికి గురైన బైక్‌గా గుర్తించారు. నాగరాజును అదుపులోకి తీసుకుని విచారించగా గత రెండేళ్లుగా ఏపీలోని నర్సరావుపేట, వినుకొండతో పాటు మిర్యాలగూడ ప్రాంతాల్లో రాత్రివేళ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేశానని.. వాటిని మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మకాలనీ ఫేజ్–3కి చెందిన డీసీఎం డ్రైవర్ మునుకుంట్ల కృష్ణకు విక్రయించినట్లు చెప్పాడు. మునుకుంట్ల కృష్ణను అదుపులోకి తీసుకుని అతడి వద్ద నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మొత్తం ఐదు బైక్‌లు స్వాదీనం చేసుకుని నిందుతులు ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ నాగార్జున, ఎస్ఐలు డి. హరీష్‌రెడ్డి, బి. రాంబాబు, ఏఎస్ఐ పి. వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు పి. బాలకృష్ణ, కె. కళ్యాణ్, సీహెచ్. సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న మాజీ సర్పంచ్



బాధితురాలికి బ్యాగ్ అందజేస్తున్న ఎస్ఐ

చింతపల్లి: రోడ్డుపై దొరికిన హ్యాండ్ బ్యాగులో ఉన్న బంగారం, నగదు, సెల్‌ఫోన్‌ను పోలీసుల ద్వారా బాధితురాలికి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు మాజీ సర్పంచ్. వివరాలు.. చింతపల్లి మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదిగిరి గురువారం కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా.. వింజమూరు ఎక్స్ రోడ్ వద్ద తన డ్రైవర్ ఎండీ చోటూ రోడ్డుపై హ్యాండ్ బ్యాగ్ పడి ఉండటం గమనించి కారును ఆపాడు. హ్యాండ్ బ్యాగును తీసి చూడగా అందులో రూ.23,000 నగదు, 5 గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, ఆధార్ కార్డు ఉన్నాయి. ఆధార్ కార్డు ఆధారంగా ఆ బ్యాగు డిండి మండల కేంద్రానికి చెందిన రమావత్ రోజాదిగా గుర్తించారు. వెంటనే డిండి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్వరరావు సమాచారం ఇచ్చి రోజాను చింతపల్లి పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ యాదయ్య చేతులమీదుగా ఆమెకు బ్యాగును అప్పగించారు. ఎస్ఐ యాదయ్య మాజీ సర్పంచ్ యాదగిరిని అభినందించారు.

ఇద్దరు బాలకార్మికులకు విముక్తి

చౌటుప్పల్ : ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పద్మశాలీ కాలనీ ఏరియాలో సర్వీసింగ్ సెంటర్‌లో బిహార్‌కు చెందిన ఇద్దరు బాలురు పనిచేస్తున్నట్లు గుర్తించారు. వారిని జిల్లా బాలల సంరక్షణ అధికారికి అప్పగిస్తామని ఎస్ఐ యాదవరెడ్డి తెలిపారు.

సాగర్‌ను సందర్శించిన కైట్ ఫ్లయర్స్



నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో వివిధ దేశాలకు చెందిన కైట్ ఫ్లయర్స్

నాగార్జునసాగర్: అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను గురువారం పలు దేశాలకు చెందిన కైట్ ఫ్లయర్స్ సందర్శించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం హైదరాబాద్‌లో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ నిర్వహిస్తారు. ఈసారి కూడా కైట్ ఫెస్టివల్‌లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాక జపాన్, థాయిలాండ్, మలేషియా, ఇండోనేషియా, కంబోడియా, వియత్నాం, శ్రీలంక, పోలాండ్, కెనడా, సింగపూర్, ఫ్రాన్స్, ఉక్రెయిన్ తదితర దేశాల నుంచి కైట్ ఫ్లయర్స్ పాల్గొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొన్న వివిధ దేశాల కైట్ ఫ్లయర్స్ గురువారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. ముందుగా బుద్ధవనంకు చేరుకున్న ఈ బృందం మహాస్థూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరం, బుద్ధ చరితవనం, ధ్యానవనం, స్థూపవనాలను సందర్శించారు. వీరికి బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన్, ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్ర స్వాగతం పలికారు. ఈ బృందానికి మహాస్థూపం సమావేశ మందిరంలో బుద్ధవనం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం టూరిజం లాంచీలో నాగార్జునకొండను సందర్శించారు. వీరితో పాటు టూరిజం అధికారులు లోకేష్, స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



అరవింద్ (ఫైల్)

హుజూర్‌నగర్: ఆటోలో వెళ్తున్న యువకుడు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో బుధవారం రాత్రి జరిగింది. గురువారం ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన కంటు అరవింద్ (28) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మాధవరాయినిగూడెంలో జరుగుతున్న కబడ్డీ పోటీలు తిలకించేందుకు బుధవారం రాత్రి ఆటో వెళ్తుండగా పీఎస్‌టీ ఆఫీస్ వద్ద ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను తప్పించబోయి రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నాడు. అరవింద్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని తండ్రి హనుమంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టాటా ఏస్‌ను ఢీకొట్టిన బైక్.. ఇద్దరికి గాయాలు



గాయపడిన సురేష్



గాయపడిన యమున

గరిడేపల్లి: టాటా ఏస్ వాహనాన్ని బైక్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లంపాడు గ్రామానికి చెందిన దేరంగుల సురేష్, అతడి సోదరి దేరంగుల యమున కలిసి సంక్రాంతి పండుగకు నేరేడుచర్ల మండలం దిర్శంచర్లలోని తమ బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం తిరిగి తమ స్వగ్రామానికి స్కూటీపై వెళ్తుండగా.. గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళ్తున్న టాటా ఏస్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి స్కూటీపై వస్తున్న వీరు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సురేష్, యమునకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సురేష్ బంధువు వేముల శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్తగా నాలుగు సినిమాలకు సంగీత దర్శకత్వం



హోమంలో పాల్గొన్న సంగీత దర్శకుడు అగస్త్య, రేఖ దంపతులు

- సంగీత దర్శకుడు బోయలపల్లి అగస్త్య

అర్వపల్లి: తన సంగీత దర్శకత్వంలో కొత్తగా నాలుగు సినిమాలు రానున్నాయని సినీ సంగీత దర్శకుడు బోయలపల్లి అగస్త్య అన్నారు. బుధవారం అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని ఆయన తన సతీమణి, రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఫౌండర్ రేఖతో కలిసి సందర్శించి పూజలు చేశారు. అలాగే భరద్వాజ ఆశ్రమంలో కూడా హోమం జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రేమ, హర్రర్, క్రైం తదితర అంశాలకు సంబంధించి తెలుగులో సినిమాలు తీయడం జరుగుతుందని, ఇంకా వాటికి పేర్లు పెట్టలేదని తెలిపారు. హిందీ, తెలుగు సినిమాలకు సంగీత దర్శకత్వం వహిస్తున్నట్లు చెప్పారు.

రైల్వే అండర్‌పాస్ కింద ఇరుక్కుపోయిన భారీ వాహనం



రైల్వేఅండర్‌పాస్ వద్ద ఇనుప ఆర్చి కింద ఇరుక్కుపోయిన భారీ వాహనం



హైవేపై నిలిచిపోయిన వాహనాలు

- హైదరాబాద్ – విజయవాడ హైవేపై చిట్యాల వద్ద ట్రాఫిక్‌జాం

చిట్యాల: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల పట్టణంలో గురువారం ఉదయం ట్రాఫిక్ జాం ఏర్పడింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు భారీ మిషనరీని తీసుకెళ్తున్న వాహనం చిట్యాల పట్టణం సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద ఇనుప ఆర్చిలో ఇరుక్కుపోయింది. దీంతో సంక్రాంతి పండుగకు వెళ్లి విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన వాహనాలు పెద్ద సంఖ్యలో హైవేపై నిలిచిపోయాయి. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, చిట్యాల ఎస్ఐ ఎస్. ధర్మా అక్కడకు చేరుకుని ఇనుప ఆర్చి కింద ఇరుక్కుపోయిన భారీ వాహనం టైర్లలో గాలి తీయించి అతికష్టం మీద రోడ్డు పక్కకు తీసుకెళ్లారు. దీంతో సుమారు గంట తర్వాత వాహనాలు యథావిధిగా హైదరాబాద్ వైపు వెళ్లాయి.

సేంద్రియ పద్ధతుల్లో బెండ సాగు ఇలా..

పాడిపంట

నడిగూడెం: వేసవి పంటగా బెండను సాగు చేసుకోవడానికి ఇదే అనువైన సమయమని, ఎలాంటి రసాయన ఎరువులను ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతులను పాటిస్తే రైతులకు పెట్టుబడి తగ్గి అధిక దిగుబడి వస్తుందని హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్ చెబుతున్నారు. సేంద్రియ పద్ధతుల్లో బెండ సాగు ఎలా చేయాలో ఆయన మాటల్లోనే..

వాతావరణం : బెండ సాగుకు వేడి వాతావరణం అనుకూలం. అతి చల్లని వాతావరణం పంట పెరుగుదలకు ప్రతికూలం. అందువలన బెండకాయ పంట వర్షాకాలం మరియు వేసవికాలంలో పండించడానికి అనుకూలమైనది.

నేలలు : సారవంతమైన నీరు ఇంకే తేలికపాటి నేలలు, మురుగు నీటి సౌకర్యం గల తేలికపాటి రేగడి నేలలు అనుకూలం.

విత్తే సమయం : వర్షాకాలపు పంటను జూన్ నుంచి జూలై వరకు, వేసవి పంటను జనవరి రెండో పక్షం నుంచి ఫిబ్రవరి చివరి వరకు విత్తుకోవచ్చు.

విత్తన మోతాదు : వేసవి పంటకు 7 నుంచి 8 కిలోల విత్తన సరిపోతుంది.



రకాలు : పర్బని క్రాంతి, అర్కఅనామిక, అర్క అభయ

విత్తన శుద్ధి :

- విత్తనాలను విత్తే ముందు 12 గంటలు నీటిలో నానబెట్టాలి.
- ఆవు మూత్రం ద్రావణంలో (1:5 నిష్పత్తిలో నీటిలో కలిపి) 30 నిమిషాలు విత్తనాలను శుద్ధి చేయాలి.
- విత్తన శుద్ధికి 100మి.లీ. ఆవు మూత్రం, 100 గ్రాములు ఆవు పేడ, 100 గ్రాములు గట్టు మట్టి లేదా పుట్ట మట్టి కలిపిన నీటిలో ఒక గంట వరకు నానబెట్టి, నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.
- బీజామృతం లేదా అమృత జలం లేదా పంచగవ్యం ద్రావణంలో 8 గంటలు నీటిలో నానబెట్టి నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.

పొలం తయారీ, విత్తే పద్ధతి : నేలను 4–5 సార్లు బాగా దున్నాలి. వర్షాకాలపు పంటను 60 సెం.మీ. ఎడంలో బోదెలపై 30 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. వేసవి కాలపు పంటను నేలను మళ్లుగా చేసి వరుసల మధ్య 45 సెం.మీ., మొక్కల మధ్య 15 నుంచి 20 సెం.మీ. దూరం ఉండేటట్లు విత్తుకోవాలి. ఒక్కొక్క రంధ్రానికి 2–3 విత్తనాలను విత్తుకోవాలి.

భూసార యాజమాన్యం :

- దభోల్కర్ పద్ధతిలో వివిధ రకాల విత్తనాలను విత్తి పెరిగిన తర్వాత భూమిలో కలియదున్నాలి.
- ఎకరానికి పశువుల ఎరువు 10 టన్నులు, 500 కిలోల ఘన జీవామృతం, వేప పిండి 100 కిలోలు, వేరుశనగ పిండి 32 –40 కిలోలు, 2 కిలోలు అజోస్పైరిల్లం , 2 కిలోలు పాస్ఫోబ్యాక్టీరియా, ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి.
- ఎకరానికి 200 లీటర్ల జీవామృతం, 15 రోజుల వ్యవధిలో సాగు నీటిలో అందించాలి.

రక్షణ పంటలు : బెండ తోట చుట్టూ జొన్న, సజ్జ, బంతి మొక్కలను పెంచాలి.

అంతర పంటలు : పైరు మధ్యలో బంతి మొక్కలను ఎర పంటగా వేయాలి. అంతర పంటలుగా ముల్లంగి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, క్యాప్సికం, కొత్తిమీర సాగు చేసుకోవచ్చు.

నీటియాజమాన్యం : గింజలు విత్తిన వెంటనే నీరు కట్టాలి. తరువాత 4–5 రోజులకు రెండోసారి నీరు పారించాలి. వేసవి పంటకు అయితే ప్రతి 4–5 రోజులకు ఒకసారి తప్పనిసరిగా నీరు పెట్టాలి.

పోషకాల యాజమాన్యం :

- 10 నుంచి 15 మి.లీ. కోడిగుడ్లు, నిమ్మకాయ రసం ద్రావణాన్ని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మొక్కలు మొలిచిన 3–4 రోజుల్లో తొలిసారి 3 శాతం పంచగవ్య ద్రావణం పిచికారీ చేయాలి.
- పూత దశకు ముందే 5 శాతం పంచగవ్య పిచికారీ చేయాలి.
- పంట రెండు వారాల వయస్సులో ఉన్నప్పుడు 400 లీటర్ల జీవామృతం సాగు నీటిలో అందించాలి.
- మొక్క 4–6 ఆకుల దశలో తులసి–కలబంద కషాయం పిచికారీ చేయాలి.
- పంటపై 2 శాతం పంచగవ్య పిచికారీ చేస్తే దిగుబడులు పెరుగుతాయి.